సాక్షి
వికారాబాద్
గురువారం । 30 । మార్చి । 2023




బీమా చేయించి.. ఆపై హత్య

బిక్యానాయక్ తండా ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ బీమా డబ్బు కోసమే తన తండ్రిని హతమార్చాడని సీఐ శంకర్ తెలిపారు. 10లో▸



ఎల్మకన్నె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

పరిగి: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు పరిగి ఆర్టీసీ డీఎం పవిత్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. పరిగి ప్రాంతంలోని ప్రజలు, విద్యార్థులు 9959226241 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



మీ సేవ, ధరణి సెంటర్ల నిర్వాహకులతో సమావేశమైన తహసీల్దార్ రమేశ్‌కుమార్

కుల్కచర్ల: మీ సేవ, ధరణి నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టకూడదని తహసీల్దార్ రమేశ్‌కుమార్ అన్నారు. ఈమేరకు బుధవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులకు అవగాహన లేకపోతే సరైన పద్ధతిలో ఆన్‌లైన్ అప్లికేషన్ సమర్పించేలా సూచించాలన్నారు. భూలావాదేవీల అంశంలో రైతులకు ఆర్థికపరమైన నష్టం వాటిల్లే అవకాశం ఉంటే రెవెన్యూ అధికారుల సూచనలకు అనుగుణంగా చలాన్లు కట్టించాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణలో అన్ని పత్రాలు జమ చేయాలని తెలిపారు. గిర్దావర్ ఖాజ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యాన్ని సహించం



మన్‌సాన్‌పల్లిలో అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ తరుణ్‌కుమార్

పెద్దేముల్: పారిశుద్ధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీపీఓ తరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, క్రిమిటోరియం, నర్సరీ, శానిటరీ పనులను పరిశీలించారు. డ్రైనేజీల్లో మురుగు, వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. తడిపొడి చెత్త నిర్వహణపై స్థానికులకు ఎందుకు అవగాహన కల్పించలేదని సెక్రెటరీ గోపాల్‌పై మండిపడ్డారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ లక్ష్మప్పను ఆదేశించారు. డీపీఓ వెంట సర్పంచ్ రుక్కిబాయి, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మా, పీఓ లక్ష్మీదేవి, ఈసీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ అంజిలప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ చందర్ తదితరులు ఉన్నారు.

సేవాభావం కలిగిఉండాలి

జెడ్పీటీసీ మంజుల

తాండూరు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం ఉండాలని తాండూరు జెడ్పీటీసీ మంజుల అన్నారు. బుధవారం మండలంలోని గౌతపూర్ పీపుల్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరం వల్ల సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉత్తమ్ చందు, గౌతపూర్ సర్పంచ్ రాజప్పగౌడ్, ప్రిన్సిపాల్ సత్యానంద్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న ఓయూలో 'బలగం' చిత్ర ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏప్రిల్ 6న ఉచితంగా 'బలగం' సినిమాను ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంపస్ కాలేజీల విద్యార్థులతో పాటు నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, కోఠి మహిళా కాలేజీ విద్యార్థులకే ఈ అవకాశం.

జీవాలొస్తున్నయ్

రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- ఏర్పాట్లు ప్రారంభించిన పశుసంవర్ధక శాఖ
- సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ సమీక్ష
- మొదటి విడతలో 10,954 యూనిట్లు మంజూరు
- మలి విడత లక్ష్యం 11,073 యూనిట్లు



వికారాబాద్: రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఐదేళ్ల క్రితం తొలి విడత లబ్ధిదారుల్లో సగం మందికి జీవాలు పంపిణీ చేసిన తర్వాత అర్ధంతరంగా ఆపేశారు. అప్పటినుంచి నానుస్తూ వచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు రెండో విడత పంపిణీకి పచ్చజెండా ఊపింది. దీంతో యాదవులు, గొల్లకుర్మల నిరీక్షణకు తెరపడనుంది.

ఆర్థిక చేయూతే లక్ష్యంగా..

రాష్ట్రంలో మాంసం ఉత్పత్తిని పెంచడంతో పాటు గొల్లకుర్మలకు ఆర్థిక చేయూతనివ్వాలనే సంకల్పంతో 2017లో ప్రభుత్వం గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రెండు విడతల్లో లబ్ధిదారులందరికీ యూనిట్లు అందజేయాలని భావించింది. జిల్లాలోని 311 సొసైటీల్లో సభ్యులుగా నమోదైన 18 సంవత్సరాలు నిండిన వారందరికీ యూనిట్ అందజేసేలా విధివిధానాలు రూపొందించింది. అయితే మొదటి విడతలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో పథకంలో మార్పులు చేపట్టింది. అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు జీవాల రీసైక్లింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలో జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఒక్క యూనిట్‌ను కూడా పంపిణీ చేయకపోవడంతో పట్టణ లబ్ధిదారులు అసంతృప్తికి లోనయ్యారు. ప్రస్తుతం రెండో విడత పంపిణీకి సిద్ధమవుతున్న క్రమంలోనూ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

కసరత్తు ప్రారంభం

మలి విడత గొర్రెల పంపిణీకి పశుసంవర్ధక శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీవాల ట్రాన్స్‌పోర్ట్‌కు టెండర ప్రక్రియపై చర్చించారు. గతంలో గొర్రెల కాపరులు తమ వాటా కింద 25 శాతం డబ్బులను డీడీల రూపంలో ఇచ్చే వారు.. ప్రస్తుతం నేరుగా కలెక్టర్ ఖాతాలో జమ చేసేలా విధివిధానాలు రూపొందించారు. ప్రభుత్వ వాటా 75శాతం నిధులు కలెక్టర్ అకౌంట్‌లో జమైన వెంటనే జీవాలు కొనుగోలు చేసి, యూనిట్లు పంపిణీ చేస్తారు.

పంపిణీ లక్ష్యం 11,071 యూనిట్లు

జిల్లాలో 22,025 మంది సొసైటీల్లో సభ్యులుగా ఉన్నారు. 2017- 18 సంవత్సరానికి సంబంధించి గొర్రెల పంపిణీ లక్ష్యం 10,954 యూనిట్లు కాగా, 2018 జూన్ చివరినాటికి 10,078 యూనిట్లు పంపిణీ చేశారు. మొదటి విడతకు సంబంధించి మరో 876 యూనిట్లు అందజేయాల్సి ఉంది. ఇందులో లబ్ధిదారులు చెల్లించిన 490 డీడీలు పశుసంవర్ధక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ లక్ష్యం 11,071 యూనిట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక యూనిట్‌పై 75శాతం సబ్సిడీ అందజేయనుంది. యూనిట్ విలువ గతంలో రూ.1.25 లక్షలు కాగా, ప్రస్తుతం రూ.1.75 లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారుడి వాటా రూ.43,250 పోను మిగతా సొమ్మును ప్రభుత్వం భరిస్తోంది. ప్రభుత్వం ప్రతి యూనిట్‌కు సబ్సిడీ కింద తన వాటాగా రూ.1,31,750 చెల్లిస్తోంది. ప్రతీ గొర్రెకు ప్రభుత్వమే బీమా చేస్తుంది. ప్రీమియం డబ్బులను సైతం యూనిట్ విలువలోనే జత చేయడంతో ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ చెల్లించాల్సి అవసరంలేదు. ఒక్కో యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును అందజేస్తారు.

పూర్తి సబ్సిడీ ఇవ్వాలి



మొదటి విడత గొర్రెల పంపిణీ ప్రారంభించి ఐదేళ్లు దాటింది. కొంత మందికి ఇంకనూ జీవాలు రాలేదు. అప్పటి నుంచి రెండో విడత పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పెండింగ్ యూనిట్లతో పాటు రెండో విడతకు సంబంధించిన వందశాతం యూనిట్లను పూర్తి సబ్సిడీతో అందజేయాలి.

– కాశయ్య, గొల్లకుర్మల సహకార సంఘం నేత

అక్రమాలపై దృష్టి సారిస్తా..

- పల్లెటూరిలోనే పుట్టిపెరిగా.. ప్రజల సమస్యలు తెలుసు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎల్మకన్నెలో ముమ్మర పర్యటన
- మ్యాథ్స్ టీచర్‌పై వేటు, పంచాయతీ కార్యదర్శికి మెమో



ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తాండూరు రూరల్: 'ఇసుక రవాణా, నాపరాతి మైనింగ్, సుద్ద తవ్వకాలపై దృష్టి సారిస్తా.. పల్లెటూరులోనే పుట్టిపెరిగినోన్ని.. ప్రజల సమస్యలు నాకు తెలుసు' అని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. తాండూరు మండలం ఎల్మకన్నెలో బుధవారం మూడు గంటల పాటు పర్యటించారు. రూ.7 కోట్లతో గ్రామశివారులోని వాగు వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు పరిశీలించారు. మే చివరి నాటికి పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ ఈఈ సుందర్‌తో పాటు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేసవికాలం సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు.

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టండి..

ఎల్మకన్నె ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ 4, 5వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గణితంలో గుణింతాలు, సరి, బేసి సంఖ్యలు, భాగహారం, భిన్నాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు వెనకబడి ఉండటాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. మ్యాథ్స్ టీచర్ హర్షవర్ధన్ (మల్కయ్య)ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని డీఈఓ రేణుకాదేవికి ఫోన్ చేసి చెప్పారు.

కార్యదర్శికి మెమో..

స్కూల్ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలు, హన్మాన్ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి సరితపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కంపోస్ట్ షెడ్ అధ్వానంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యదర్శికి మెమో జారీ చేయాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డిని ఆదేశించారు.

మనసు పెట్టి పని చేయాలి..

ఉద్యోగులు, సిబ్బంది జీతం కోసం కాకుండా మనసు పెట్టి, మానవత్వంతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఎల్మకన్నెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో మాట్లాడారు. గర్భిణులకు ప్రతి నెలా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని సీడీపీఓ రేణుకకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ చిన్నప్పల నాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ వెంకట్రావ్‌రావు, ఏఈ నందిని, మిషన్ భగీరథ డీఈ రమేశ్, ఏఈ ప్రణీత్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ రతన్‌సింగ్, ఏపీఓ నరోత్తంరెడ్డి, సర్పంచు నాగమణి, నాయకులు జగదీశ్ తదితరులు ఉన్నారు.

మా పథకాలు దేశానికే ఆదర్శం

- జల్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ప్రత్యేక నిధులతో అభివృద్ధికి చర్యలు
- మత రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి




సభలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: పేదలు అధికంగా నివసించే జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రత్యేక నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, దళితబంధు, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, చేప పిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శనంగా నిలుస్తున్నారన్నారు. 5 లక్షల మంది విద్యార్థులకు వెయ్యి గురుకుల పాఠశాలల ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1.20లక్షలు వెచ్చించి చదివిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల జేబులు నింపుతుంటే.. గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచుతూ మోదీ పేదల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఇక్కడి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాల వడ్డీ త్వరలోనే ఇవ్వడం జరుగుతుందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే వారికి రూ.3 లక్షలు ఇస్తున్నామన్నారు.

భానుడి భగభగ

- దంచికొడుతున్న ఎండ
- ఉదయం 7గంటల నుంచే సూర్యుడి ఉగ్రరూపం
- వేడి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- సాగునీటి కొరతతో ఎండుతున్న పంటలు



తాండూరు: భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సూర్యోదయం నుంచే ఎండ దంచి కొడుతోంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షం ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మూడు రోజుల పాటు తీవ్రమైన మంచు, చలి విసిరింది. రెండు రోజులుగా తిరిగి వేడి రాజుకుంటోంది. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నెలాఖరులోనే ఎండ తీవ్రత ఇంతగా ఉందంటే ఏప్రిల్, మేలో పరిస్థితులపై జనం జంకుతున్నారు.

జనం అవస్థలు

జిల్లాలోని అన్ని మండలాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం గరిష్టంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బంట్వారం మండలంలో అత్యధికంగా 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. యాలాలలో 37.7, మర్పల్లిలో 37.3 డిగ్రీల చొప్పున రికార్డయ్యింది. వారం రోజుల క్రితం వరకు 30 నుంచి 32 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు మూడు రోజులుగా పైపైకి ఎగబాకుతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉక్కపోత భరించలేకపోతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు పొద్దంతా తిరుగుతున్నాయి.

ఎండుతున్న వరి

ఎండ ప్రభావంతో ఇప్పటికే పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు బోరుబావులు వట్టిపోతున్నాయి. వేసవిలో ప్రధాన పంటగా సాగవుతున్న వరికి నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే పలు చోట్ల వరి చేలు ఎండిపోతున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి

మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు వడదెబ్బ బారిన పడుతున్నారు. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు పాటించాలి. వడ దెబ్బతో ఎవరైనా అనారోగ్యం పాలైతే వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేశాం.

– రవిశంకర్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

ట్రోల్ చేస్తే తోలు తీస్తారు!

- అభ్యంతరకరమైన వాటిపై చట్టప్రకారం చర్యలు
- ఇటీవల 20 కేసులు నమోదు చేసిన సైబర్ కాప్స్
- ఎనిమిది మందిని గుర్తించి నోటీసులు జారీ
- ఎమ్మెల్సీ కవితపైనా ట్రోలింగ్స్: డీసీపీ స్నేహ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియాతో పాటు యూట్యూబ్ చానళ్లల్లో విచ్చలవిడిగా, విచక్షణ మరిచి ట్రోలింగ్స్ చేసే వారిపై నగర సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు వీటిపై కేసులు నమోదు చేసి, కంటెంట్ డిలీట్ చేయించడానికే పరిమితమయ్యారు. ఈ ధోరణి ట్రోలర్స్‌కు లోకువగా మారి మరీ రెచ్చిపోతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత వ్యవహారంలో కొన్ని ట్రోలింగ్ చానల్స్ బరితెగించాయి. అభ్యంతరకరంగా, అసభ్యంగా, పరువు నష్టం కలిగించేలా, మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా ఉన్న పోస్టులకు సంబంధించి 20 కేసులు నమోదు చేసి ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుతో..

- దర్యాప్తు దశలోనే ఉన్న ఓ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితతో పాటు మరి కొందరు రాజకీయ నాయకులపై ట్రోల్ కుర్రాడు, మిస్టర్ మస్సబ్బాయ్, యంకమ్మ ట్రోల్స్, తెలుగు ట్రోల్స్ న్యూ, చిమ్టు ట్రోల్స్, టీమ్ ఆఫ్ ట్రోలింగ్, బంతిపువ్వు ట్రోల్స్, చందు ట్రోల్స్, చెవిలోపువ్వు చానళ్లల్లో ట్రోలింగ్స్‌తో పాటు ఫొటోల మార్ఫింగ్ సైతం చేశారు. ఓ మహిళా ప్రజా ప్రతినిధిపైనే ఈ స్థాయిలో జరిగితే సాధారణ మహిళల విషయం ఏంటన్న అంశంపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. బాధ్యుల్ని పట్టుకోవడానికి ఇన్‌స్పెక్టర్లు పి.పద్మ, డి.దర్పుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.
- అసెంట్‌గా పిలిచే ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఆధారంగా దర్యాప్తు చేసిన స్పెషల్ టీమ్స్ ఈ తొమ్మిది చానళ్లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది మంది బాధ్యుల్ని గుర్తించారు. ఆయా ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఎ.శ్రీనివాసరావు (విజయనగరం), ఎస్.మణికంఠ (కడప), బి.శ్రవణ్ (నిజామాబాద్), ఎం.శ్రీను (వరంగల్), పీఎస్ జ్యోతి కిరణ్ (కృష్ణా), వి.నవీన్ (జగిత్యాల), బి.చంద్రశేఖర్ (కరీంనగర్), బి.శ్రీకాంత్‌లకు (కడప) నోటీసులు జారీ చేశారు. వీరంతా 20-30 ఏళ్ల మధ్య వయస్కులని, ఎలాంటి రాజకీయ కోణం లేకపోయినా లైక్స్, టీఆర్పీ, రెవెన్యూ కోసమే ఇలా చేస్తున్నారని గుర్తించారు. వీరితోనే ఆయా చానల్స్‌లోని కంటెంట్‌ను డిలీట్ చేయిస్తున్న పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు.



వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

ఇలాంటి ట్రోలర్స్‌తో పాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టే వారికి ఇదో హెచ్చరికని, ఏ మహిళను ట్రోల్ చేసినా వదిలిపెట్టమని స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. యూట్యూబ్ ధోరణిపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సీ) లేఖ రాయాలని నిర్ణయించామన్నారు. యూట్యూబ్ సహా మరికొన్ని సామాజిక మాధ్యమాల్లో ఉన్న అనేక అంశాలపై దృష్టి పెడుతున్నామని ఏసీఈప కేవీఎం ప్రసాద్ చెప్పారు. దీనికోసం సైబర్ క్రైమ్ ఠాణాలో సోషల్ మీడియా టీమ్ పని చేస్తోందన్న ఆయన నిర్దిష్ట ఫిర్యాదులు లేకపోవడంతో కేసులు నమోదు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. కరాటే కళ్యాణి మాదిరిగా ప్రతి సామాజిక కార్యకర్త ముందుకు వచ్చి ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి, బాధ్యతలపై చర్యలు తీసుకుంటామన్నారు.

'డబుల్' దరఖాస్తుల స్వీకరణ

ధారూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్.. వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ భువనేశ్వర్, డీటీ విజయ్‌లతో కలిసి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పురోగతిపై ఆయన తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. బుధవారం వరకు ధారూరులో 157 మంది, లక్ష్మీనగర్ తండాలో 58 మంది, తిమ్మానగర్‌లో 15 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఇంతవరకు 230 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అంతకుముందు ధారూరులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను సంచిత్ గంగ్వార్ పరిశీలించారు.



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న సంచిత్ గంగ్వార్

క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

ఆర్టీసీ ఆర్ఎం శ్రీధర్



తాండూరు ఆర్టీసీ డిపోలో సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్ఎం శ్రీధర్

తాండూరు: ఎండలు తీవ్రమవుతున్నందున ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంగారెడ్డి రీజినల్ మేనేజర్ (ఆర్టీసీ ఆర్ఎం) శ్రీధర్ సూచించారు. బుధవారం ఆయన తాండూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించి ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. డిపో ప్రాంగణంలోని దుకాణాలు రెన్యూవల్ చేయాలని చెప్పారు. ఆర్టీసీ కొరియర్ సర్వీస్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. డిపో ప్రాంగణంలో మొక్క నాటారు. ఆయన వెంట డిపో మేనేజర్ సమత, సిబ్బంది ఉన్నారు.

తల్లి, కూతురు అదృశ్యం



యాదమ్మ(ఫైల్)



నందిని(ఫైల్)

కుల్కచర్ల: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన చౌడాపూర్ మండలంలో చోటుచేసుకుంది. నవాబుపేట ఎస్ఐ పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన నర్సింలుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య శాంతమ్మ చనిపోయింది. ఆమె చెల్లెలు యాదమ్మను వివాహం చేసుకున్నాడు. ఈ నెల 27న రాళ్లు కొట్టేందుకు మొదటి భార్య కుమారుడు వెంకటేశ్‌తో కలిసి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగ రెండో భార్య యాదమ్మ(38), కూతురు నందిని(15) కనిపించలేదు. సాయంత్రం, మరుసటి రోజు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాండూరు వ్యాపారి గోవాలో మృతి



రాఘవేందర్ (ఫైల్)

తాండూరు టౌన్: డబ్బు వసూలుకు వెళ్లిన ఓ వ్యాపారి గోవాలో శవమై కనిపించాడు. 20 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆయన 10 రోజుల క్రితమే గోవాలో చనిపోయినట్లు తెలిసింది. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మున్సిపల్ పరిధిలోని శివాజీ చౌక్ సమీపంలో నివాసం ఉంటున్న షాదీపూర్ రాఘవేందర్(37) స్టోన్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 10న బిజినెస్ కలెక్షన్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. గతంలో కలెక్షన్ కోసం వెళ్లినప్పుడు రెండు మూడు రోజుల తర్వాత వచ్చేవాడు. ఈసారి ఐదు రోజులైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా గోవాలో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం గోవాకు చేరుకున్న పోలీసులు, అక్కడ విచారణ చేపట్టగా రాఘవేందర్ శవం గోవా ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉన్నట్లు తెలుసుకున్నారు. పది రోజుల క్రితమే రాఘవేందర్ మృతి చెందినట్లు అక్కడి పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని తాండూరుకు తీసుకురానున్నట్లు సీఐ తెలిపారు. అయితే బిజినెస్ కలెక్షన్ కోసం వెళ్లిన వ్యక్తి గోవాకు ఎవరితో వెళ్లాడనే విషయమై ఆరా తీస్తున్నామని, గోవా పోలీసుల నుంచి సైతం సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం విషయాలు తెలుస్తాయని, దీని ఆధారంగా హత్యా..?, ఆత్మహత్యా..? మరేదైనా ఉందా అనే కోణంలో కేసు దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

బీమా చేయించి ఆపై హత్య

- పథకం ప్రకారం తండ్రిని హతమార్చిన కొడుకు
- బీమా డబ్బు కోసమే దారుణం
- వివరాలు వెల్లడించిన సీఐ శంకర్
- రిమాండ్‌కు తరలింపు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శంకర్

కొడంగల్: బీమా డబ్బు కోసమే బిక్యానాయక్ తండా ఉప సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ తన తండ్రి ధాన్‌సింగ్ నాయక్‌ను హతమార్చాడని సీఐ శంకర్ తెలిపారు. హత్య కేసు వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. మండలంలోని బిక్యానాయక్ తండాకు చెందిన రాథోడ్ శ్రీనివాస్ నాయక్ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. బీమా తీసుకున్న వారు చనిపోతే వారి కుటుంబానికి డబ్బులు ఇప్పించి అందులో కొంత మొత్తం తీసుకునే వాడు. ఈ క్రమంలో డబ్బులకు ఆశ పడిన శ్రీనివాస్ నాయక్ తన తండ్రి ధాన్‌సింగ్ నాయక్(68) పేరు మీద ప్రమాద బీమా రూ. 50 లక్షలకు పాలసీ చేయించాడు. నామినీగా తన పేరు రాయించుకున్నాడు. తండ్రిని చంపి బీమా డబ్బు కాజేయాలనే ఉద్దేశంతో తాండూరులో ప్లాట్ రిజిస్ట్రేషన్ ఉందని చెప్పి తన తండ్రిని మంగళవారం ఉదయం బైక్‌పై ఎక్కించుకొని బయలుదేరాడు. కొడంగల్ దాటిన తర్వాత ఉడిమేశ్వరం గ్రామ సమీపంలో ఖాళీ స్థలంలో బైక్ ఆపి ధాన్‌సింగ్ తలపై బండరాయితో కొట్టి చంపాడు. బైక్‌ను చెట్టుకు గుద్ది తండ్రి శవాన్ని బైక్ వద్ద పడేశాడు. యాక్సిడెంట్ అయినట్లు అందరినీ నమ్మించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులకు ప్రమాదం జరిగిన ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో వారి శైలిలో విచారించారు. నిందితుడు శ్రీనివాస్ జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పాడు. మృతుని మరో కుమారుడు రవినాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ రవిగౌడ్ పాల్గొన్నారు.

డబ్బు కోసమే డ్రామా

ఒక్కొక్కటిగా బయటపడుతున్న శ్రీనివాస్ నాయక్ బాగోతాలు



నిందితుడు రాథోడ్ శ్రీనివాస్

బొంరాస్‌పేట: బీమా డబ్బు కోసం రెండు రోజుల క్రితం బిక్యానాయక్ తండా ఉప సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ తన కన్న తండ్రి రాథోడ్ ధన్‌సింగ్‌ని కడతేర్చిన విషయం తెలిసింది. నిందితుడి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బీమా డబ్బు కాజేసేందుకు పైరవీలు చేసేవాడని తెలిసింది. శ్రీనివాస్ నాయక్‌పై పంచాయతీ తోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లో, తండాల్లో పలు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు రాథోడ్ శ్రీనివాస్‌కు భార్య సుజాత, ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య చనిపోయిందని మూడేళ్ల క్రితం శ్రీనివాస్ నాయక్ బీమా డబ్బు రూ. 5లక్షలు కాజేసినట్లు తెలిసింది. అయితే సుజాత చనిపోలేదు. ఆమెనే తన రెండో భార్యగా చూపే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇదే తండాకు చెందిన దేవులానాయక్‌కు ముగ్గురు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు రమేశ్ చనిపోయాడని చిత్రీకరించి బీమా డబ్బు ఇప్పించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా బీమా కంపెనీలు పూర్తి సమాచారం పొందిన తరువాతే చనిపోయిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లిస్తారు. అయితే శ్రీనివాస్ నాయక్ బీమా సొమ్ము అంత సులువుగా ఎలా క్లెమ్ చేయిస్తున్నాడో ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయనకు ఎవరు సహకరిస్తున్నారో తెలియాల్సి ఉంది.

తండ్రిని నేరస్తుడిగా చూపే యత్నం

తండ్రి ధన్‌సింగ్‌ను మంగళవారం హత్య చేసిన రాథోడ్ శ్రీనివాస్ నాయక్ పోలీసుల విచారణలో తండ్రిని నేరస్తుడిగా చూపే యత్నం చేశాడు. తన భార్య పట్ల తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపాడు. అయితే అతని భార్యను విచారించగా ధన్‌సింగ్ పేరుకే మామ అని కన్నతండ్రిలా చూసుకునే వాడని తెలిపినట్లు సమాచారం. బుధవారం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అప్పు చెల్లించలేదని తాళం



మొగులయ్య ఇంటికి తాళం



ఆరుబయట మొగులయ్య కుటుంబం

- ఆరుబయటే జీవనం సాగిస్తున్న కుటుంబం
- దిర్సంపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసులకు ఫిర్యాదు

దోమ: వడ్డీ డబ్బు కోసం ఓ కుటుంబాన్ని ఇంటి నుంచి వెళ్లగొట్టి తాళం వేసిన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిర్సంపల్లికి చెందిన పీ చిన్న మొగులయ్య, నీలమ్మ దంపతులు గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నారాయణపేట జిల్లా కోస్గీ మండలం సర్జాఖాన్‌పేట్ గ్రామానికి చెందిన పీ నరేశ్‌తో మూడు సంవత్సరాల క్రితం రూ. 2లక్షలు అప్పు తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం అప్పు చెల్లించారు. అయితే వడ్డీ డబ్బు కట్టలేకపోయారు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం నరేశ్ తమ కుటుంబాన్ని ఇంట్లో నుంచి గెంటేసి తాళం వేశాడని మొగులయ్య తెలిపారు. నాలుగు రోజులుగా పిల్లలతో ఆరుబయటే ఉన్నట్లు వివరించాడు. అయితే వడ్డీ డబ్బు చెల్లించడానికి కొంత సమయం కావాలని కోరినా వినకుండా ఇంటికి తాళం వేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇచ్చిన డబ్బులే ఇవ్వలేదు

తన వద్ద మొగులయ్య రూ. 3.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడని నరేశ్ తెలిపాడు. తాను డబ్బు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నాడు. అయితే డబ్బు విషయంలో ఇబ్బంది పెట్టడం వల్లే ఇంటికి తాళం వేశానని తెలిపాడు. గ్రామస్తుల సహకారంతో మొగులయ్యకు మళ్లీ తాళం ఇవ్వడానికి వెళితే తీసుకోలేదన్నాడు. ఈ విషయంపై ఎస్ఐ విశ్వజన్‌ను వివరణ కోరగా.. మొగులయ్య ఇంటికి నరేశ్ తాళం వేసిన విషయం తెలిసిందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

జీఓ 58తో పేదలకు లబ్ధి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.58తో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటచారి అధ్యక్షతన నిర్వహించిన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 483మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎళ్ల నుంచి ఇంటి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు మేలు చేసేందుకే సీఎం కేసీఆర్ ఇళ్ల క్రమబద్ధీకరణకు జీఓ 58ను విడుదల చేశారని చెప్పారు. ఇళ్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. అర్హులు ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ సభ్యుడు దాస్‌గౌడ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నష్టాల నుంచి లాభాల్లోకి..

- నావంద్గీ సొసైటీకి రూ. 20లక్షల ఆర్థిక మిగులు
- వ్యాపారంతోనే గాడిలోకి..
- సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి వెల్లడి
- బకాయిలు చెల్లిస్తేనే కొత్త రుణాలు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం



రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సభ్యులు

బషీరాబాద్: నష్టాల్లో కూరుకుపోయిన సొసైటీని రెండేళ్లలో లాభాల బాటలోకి తీసుకువచ్చామని నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాల ద్వారా ఈ యేడాది రూ. 20లక్షల నిధులు కమీషన్ ద్వారా సొసైటీకి సమకూరినట్లు వెల్లడించారు. బుధవారం సొసైటీ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆర్థిక వనరులు, బకాయిల వసూల్లు, కొత్త రుణాల మంజూరు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. వడ్లు, శనగల వ్యాపారం ద్వారా రూ. 14లక్షలు సంఘానికి సమకూరినట్లు వివరించారు. ఎల్టీ లోన్లు, బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్నవారంతా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. సొసైటీలో 1,220 మంది రైతులకు రూ.6.44 కోట్ల పంట రుణాలు, 193 మందికి దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామని వివరించారు. వీరిలో చాలా మంది సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో అధిక వడ్డీ భారం పడుతోందన్నారు. ఈ ఏడాది దీర్ఘకాలిక రుణాలు 35 శాతం, పంట రుణాలు 80 శాతం వసూలు చేసినట్లు చెప్పారు. ఎల్‌టీ బకాయిలు 50శాతం వసూలు చేస్తే కేంద్ర బ్యాంకు నుంచి కొత్త రుణాలు మంజూరు అవుతాయన్నారు. రూ. 2కోట్లతో సొసైటీ ఆధ్వర్యంలో రైసు మిల్లు, గోదాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల చనిపోయిన రైతు కుటుంబాలకు సహకార సంఘం తరఫున ఐదు మందికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, డైరెక్టర్లు రంగారెడ్డి, అశోక్ గౌతం, శ్రీనివాస్ రెడ్డి, నవీన్‌రెడ్డి, హన్మిరెడ్డి, రూప్ల నాయక్, అనుసూయ బాయి, సీఈఓ బందెయ్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్పంచులపై ఎమ్మెల్యే కుట్రలు

- పనులు పూర్తిచేశాక రద్దు చేయడం దారుణం
- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: కాంగ్రెస్ సర్పంచులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కుట్రలు చేస్తున్నారని, సర్పంచులను ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆరోపించారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలతో సర్పంచ్ పద్మ సీసీ రోడ్డు వేయించారు. అయితే రోడ్డు పనులు పూర్తయ్యాక పనులు రద్దయినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతోనే అధికారులు ఇలావ్యవహరిస్తున్నారని, ఇందుకు నిరసనగా మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సీసీ రోడ్డును పనులు పూర్తి చేసిన తరువాత రద్దు చేయడం వెనుక ఎమ్మెల్యే కాలె యాదయ్య కుట్ర ఉందన్నారు. కాంగ్రెస్ సర్పంచులను ఇలా బెదిరించి పార్టీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలోకి రాని సర్పంచులకు నిధులు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం.. చేవెళ్లలో యాదయ్య కుటుంబ ఈ తరహా పాలన సాగిస్తోందని అన్నారు. ఎస్సీలను రాజకీయంగా ఎదగనివ్వడం లేదన్నారు. లిక్కర్ స్కాంలో కవితను ఈడీ విచారణకు పిలిస్తే గగ్గోలు పెట్టిన ప్రభుత్వం మరి ఒక మహిళా సర్పంచ్ పనులు చేస్తే రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రం నుంచి వచ్చిన డబ్బులను ఎమ్మెల్యే లెటర్ ఇచ్చి రద్దు చేయించడంపై వారు మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలని, లేని పక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పరంగా బిల్లు చెల్లించకుంటే కాంగ్రెస్ కుటుంబ సభ్యులంతా కలిసి సర్పంచ్‌కు డబ్బు ఇస్తామన్నారు. ఎమ్మెల్యేకి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని, ఆ విషయం మరిచి పోవడన్నారు. ఎమ్మెల్యే తీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎస్ఐ భరత్ భూషణ్ అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తించడంపై ఆయన మండిపడ్డారు. అనంతరం రోడ్డు పనులకు సంబంధించిన బిల్లు మంజూరు చేయాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏ మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు సీ సత్యనారాయణరెడ్డి, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, నవాబుపేట మండలాల అధ్యక్షులు, నాయకులు వసంతం, భీం భరత్, దర్శన్, మధుసూదన్ రెడ్డి, వెంకటయ్య, ప్రభాకర్‌రెడ్డి, కొండల్ యాదవ్, ఉపేందర్‌రెడ్డి, యాదయ్య, ప్రసాద్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై దాడి హేయమైన చర్య



దాడి ఘటనను కలెక్టర్‌కు వివరిస్తున్న సంఘం నాయకులు

అనంతగిరి: కుల్కచర్ల మండలం బండమీది తండా పంచాయతీ జూనియర్ కార్యదర్శి వెంకటయ్యపై జరిగిన దాడిని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం తరఫున కలెక్టర్, డీపీఓలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న ఫారూక్, రామకృష్ణ, నర్సింగ్‌రావు, మురళీకృష్ణ, మాణిక్యం, మాధవి, ఇందిర, రజిత, స్వప్న, రవి, శ్రీశైలం, జగన్‌రెడ్డి, రాంవిహార్, కిషన్, ప్రవీణ్, సురేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

మొయినాబాద్: భర్త కొట్టాడని ఓ మహిళ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని అమీర్‌గూడలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. అమీర్‌గూడకు చెందిన జంగయ్య, సుజాత(45) దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ నెల 24 పెద్దకూతురు అనూషకు కొడుకు పుట్టడంతో ఆమెను 27న రాత్రి 10 గంటలకు పుట్టింటికి తీసుకువచ్చారు. 28న రాత్రి దంపతులిద్దరూ గొడవపడుతూ.. జగన్ భార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె తలకు గాయమైంది. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తదితరులు

- కేసులు పెట్టి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేస్తారా?
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఖబర్దార్ మోదీ.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కుటుంబంపై కేసులు పెట్టి జైల్లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడానికి నిరసిస్తూ బుధవారం పరిగి బస్టాండ్ వద్ద సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం వారిదని అన్నారు. పేదలకు కూడు, గుడ్డ ఉందంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ చేసిన సంస్కరణలే అన్నారు. భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందంటే అది కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే అని అన్నారు. చిన్న కేసును బూచిగా చూపి రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఏ కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో పారదర్శకత

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- మూడో రోజుకు చేరిన 'పల్లె పల్లెకూ పైలెట్'



దేవనూరులో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: పథకాల అమల్లో పారదర్శకంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. పల్లె పల్లెకూ పైలెట్ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం దేవనూరు, దుబ్బతండా, దేవులాతండా, గోరేపల్లి, సంగెంకుర్దు, హాజీపూర్, కిష్టాపూర్, ముకుందాపూర్, జక్కేపల్లి, బెన్నూరు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గాన్ని ప్రత్యేక నిధులతో భారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఆసరా పింఛన్ల మంజూరు, పక్కాగృహాల మంజూరులో పారదర్శకత పాటిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను పొరుగు రాష్ట్రాల ప్రజలు మెచ్చుకుంటున్నారని అన్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజలు తెలంగాణలో విలీనం చేయాలనే ప్రతిపాదనలు తన దృష్టికి వచ్చిందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొత్త పంచాయతీ భవన నిర్మాణ పనులు, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. దుబ్బతండా, దేవులాతండా, గోరేపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తుల కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి త్వరలో బస్సు నడిచేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శివకుమార్, సాయమ్మ, శ్రీలత, ఒంగోని బాయి శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, నారాయణమ్మ, శాంతిబాయి, పటేల్‌రెడ్డి, ఎంపీటీసీలు మంత్రి మొగులమ్మ, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఆశన్న, నాయకులు అనంతయ్య ముదిరాజ్, మంత్రి వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, లాలప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అన్వేష్‌రెడ్డి (ఫైల్)

పెద్దేముల్: పంట సాగుకు, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన డీ నారాయణరెడ్డికి ఇద్దరు భార్యలు. వారు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదటి భార్య పద్మమ్మకు ఇద్దరు కుమారులు గోపాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి. గోపాల్‌రెడ్డికి పదేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమాతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. గోపాల్‌రెడ్డికి మూడు ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం, పంట సాగు పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, చేసిన అప్పులు అధికం కావడంతో కుటుంబ భారం పెరిగింది. దీంతో తాండూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిలో చేరాడు. అయినా అప్పులు తీరకపోవడం, ఆర్థిక సమస్యలు అధికం కావడంతో మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గోపాల్‌రెడ్డిని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.